**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417

# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 11 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | ఆదివారం, జూలై 6 2025 | పేజీలు : 4




## ప్రియుడితో మాట్లాడొద్దన్నందుకు పీక పిసికి చంపింది

హైదరాబాద్ జులై, 5: ప్రియుళ్ల మోజులో పడి.. కట్టుకున్న భర్తల్ని ఇటీవలి కాలంలో కొంత మంది భార్యలు చంపేస్తున్నారు. వాళ్లంతా కిరాయి మూకలతోనో, ప్రియుళ్ల సాయంతోనో భర్తల్ని పరలోకాలకు పంపించారు. ఇవాళ హైదరాబాద్‌లోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలో ఒక భార్య దీనికి భిన్నంగా చేసింది. ఎవరి సాయం తీసుకోకుండా అర్ధరాత్రి స్వయంగా ఆమె చేతులతోనే భర్త పీక పిసికి ప్రాణాలు తీసేసింది. అయితే, ఆ సమయంలో భర్త ఫుల్ గా మద్యం సేవించి ఉండటంతో పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే ప్రాణాలొదిలాడు. అంతే, వాల్యూమ్ 2 స్టార్ట్ చేసింది ఆ ఇల్లాలు. అయ్యనా దేవుడో అంటూ.. దిక్కులు పెక్కటిల్లేలా ఏడ్వటం మొదలుపెట్టింది. నీకు అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా పతిదేవుడో అంటూ గగ్గోలు పెట్టింది.. ఏం కష్టమొచ్చిందని ప్రాణాలు తీసుకున్నావు మహానుభావా అంటూ సందట్లో సడేమియా చేసి, గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని స్వగ్రామం నారాయణపేటకు తీసుకెళ్లి.. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకూ బాగానే నెట్టుకొచ్చింది కాని, ఎక్కడైనా కొంచెం డోసు ఎక్కువైందో ఏమోకాని, మృతుడి భార్య ప్రవర్తనపై బంధువులకు కాస్త అనుమానం వచ్చింది. శవాన్ని పరీక్షగా చూడ్డం మొదలు పెట్టి మొత్తానికి పసిగట్టారు. అంజిలప్ప గొంతుపై ఉన్న మరకలను చూసి భర్త గొంతు నొక్కేసి చంపేసుంటుందని రూఢీ చేసుకుని పోలీసుల్ని పిలిచారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి భార్య రాధను ప్రశ్నించారు. ఆమెపై అనుమానంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా.. ఆమె అసలు విషయం చెప్పేసింది. ఇక, దారుణానికి సంబంధించిన పూర్వాపరాల్లోకి వెళ్తే, మహబూబ్‌నగర్ జిల్లా రామకృష్ణయ్యపల్లికి చెందిన అంజిలప్పతో రాధ అనే మహిళకు 2014లో పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని.. ఓ నిర్మాణ సంస్థలోభార్యాభర్తలిద్దరూ కూలీలుగా చేరి.. అక్కడే గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా రాధ ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం నడుపుతోంది. అయితే అలాంటివి వద్దని, అతనితో ఫోన్ మాట్లాడొద్దని భర్త అంజిలప్ప ఆమెను మందలించాడు. దీంతో అంజిలప్పపై కోపం పెంచుకున్న రాధ.. జూన్ 22న అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న తన భర్త గొంతు నులిమి హత్య చేసింది. పోలీసుల విచారణలో అంజిలప్పను తానే హత్య చేసినట్లు రాధ అంగీకరించిందని.. దీంతో ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.




హైదరాబాద్, జులై 5: రైతులకు ఎవరు ఏం చేశారో చర్చిద్దామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. ఈరోజు (శనివారం) మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 8న ఉదయం 11 గంటలకు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. 72 గంటల సమయం ఇస్తామని.. సీఎం రేవంత్ రెడ్డి ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. పేటీఎం మాదిరి.. పే సీఎంగా రేవంత్ పేరు సంపాదించారని విమర్శించారు. రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఖచ్చితంగా ఎగ్గొడుతోందని మండిపడ్డారు. అన్నదాతకు సున్నం పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమంటూ విరుచుకుపడ్డారు. రైతు సమస్యలపై చింతమడకు, కొండారెడ్డిపల్లె అయినా సరే.. రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ అని స్పష్టం చేశారు. నిజం ఒప్పుకోని వాడిని.. నటించే వాడిని రేవంత్ రెడ్డి అంటారు అంటూ ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల కల్పనపై అశోక్ నగర్‌లో నిరుద్యోగుల మధ్య చర్చకు రావాలని సవాల్ చేశారు. నాలుగు వేల పెన్షన్, రూ. 2,500 కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో సీఎం సొంత నియోజకవర్గంలో జెడ్పీటీసీ కూడా కాంగ్రెస్ గెలవదన్నారు. 'వందనా.. వాళ్ళ బొందనా? వంద సీట్లు కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది. వంద గెలవాలంటే.. ముందు ప్రజలు ఓట్లు వేయాలి కదా. రేవంత్ రెడ్డి దండుపాళ్యం గ్యాంగ్ మాత్రమే తెలంగాణలో జోరు మీదుంది. గుడ్డలు ఊడదీస్తేనే ఇందిరమ్మ గొప్పతనం తెలుస్తుందని రేవంత్ చెప్పటం సిగ్గుచేటు. రేవంత్‌కు బేసిన్ తెలియదు.. బెండకాయ తెలియదు' అంటూ ఎద్దేవా చేశారు. ఎరువులు ఇవ్వటం చేతకాని వాడికి కేసీఆర్‌తో చర్చ ఎందుకని నిలదీశారు. ఏ రైతు, ఏ ఎద్దును అడిగినా వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆర్ అని చెప్తారన్నారు. వ్యవసాయం మాత్రమే కాదు.. మత్స్య సంపదను సృష్టించిందే కేసీఆర్ అని అన్నారు. హారతులు పట్టి ఆంధ్రాకు నీటిని పంపిందే కాంగ్రెస్ నేతలు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




## మంత్రి సీతక్కకు మావోయిస్టుల మరో లేఖ.. ఈసారి ఏం చెప్పారంటే..

వరంగల్: తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ను హెచ్చరిస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా మావోయిస్టు పార్టీ ఆ లేఖ తాము రాయలేదంటూ మరో సంచలన లేఖ విడుదల చేశారు.

**ఆ లేఖ మేము రాయలేదు..** మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కకు వచ్చిన లేఖ తాము రాయలేదని జగన్ చెప్పారు. తమ పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. అలాగే మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావ్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు. అణచివేతలతో మావోయిస్టు పార్టీని నిర్మూలించడం సరైన పద్ధతి కాదని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో తమ పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ తమకు సహకారం అందించే ప్రజలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు చెబుతున్నారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆదివాసీలను పోలీస్ స్టేషన్ కు రప్పించి బెదిరింపులకు గురిచేస్తున్నారని.. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ఆపాలని, కుమురం భీమ్ జిల్లాలో 339 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించేందుకు తెచ్చిన జీవో నెం.49ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి సీతక్కకు వారం కిందట మావోయిస్టుల పేరుతో విడుదలైన ఓ లేఖ చర్చనీయాంశమైంది. ఆదివాసీ హక్కులను కాలరాస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా.. ఉద్యమ నేపథ్యం మర్చిపోయి మంత్రి సీతక్క మౌనంగా ఉన్నారంటూ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక మంత్రి పదవిలో ఉండి కూడా ఆ పనులకు అండగా ఉండటంలో విఫలమయ్యారని తీవ్ర విమర్శలు గుప్పించారు.

# డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్..

## 10 నుంచి అకౌంట్‌లోకి వడ్డీ లేని రుణాలు!




## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జులై 5: ఆర్టీసీలో 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల రూపాయల చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అందజేశారు. అనంతరం మహిళా రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి (మహిళా సాధికారత లో ప్రగతి చక్రాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు.

అవకాశాలు ఉన్న ప్రతీ దగ్గర వ్యాపారం కోసం మహిళా సమాఖ్యలకు ఇస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరీమణుల ను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలదన్నారు. కుటుంబ పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా చేస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా అభివృద్ధిలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: మంత్రి పొన్నం....** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం నమోదు కాబోతుందని.. ఈ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్‌లు చాలా కష్టపడుతున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సును వాడుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వెళ్తోందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు.

**మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క...** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 24 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు పథకం తెచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. ఉచిత ప్రయాణమే కాదు మహిళలను బస్సులకు ఓనర్లను చేసిందన్నారు. మహిళల ఎదుగుదలనే సమాజ ఎదుగుదల అని చెప్పుకొచ్చారు. ఆ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని.. వడ్డీలేని రుణాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల అనుభవాలను తెలిపే పుస్తకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మండల సమాఖ్యలో ఉన్న మహిళల కోరికలు నెరవేరుతున్నాయన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి 25 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలు పొందాయని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఇబ్బందులు లేకుండా రుణాలు ఇస్తున్నాయన్నారు. మహిళలందరూ ఎల్లుండి నుంచి సంబరాలు చేయాలని.. ప్రభుత్వ ప్రోత్సహకాలన్నీ సంఘాలు ఉపయోగించుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.




# నిరుద్యోగులకు భారీ శుభవార్త!

## త్వరలోనే 5 జాబ్ నోటిఫికేషన్లు వస్తున్నాయ్!!

హైదరాబాద్, జులై 5: తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేందుకు టీజీపీఎస్సీ సమాయాత్తమవుతోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల (డిప్యూటీ ఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ ఇప్పటికే టీజీపీఎస్సీకి అందించింది. నిజానికి, పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్‌సీఈఆర్‌టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులతోపాటు మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022లోనే అనుమతి ఇచ్చింది. ఇందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టులు ఉన్నాయి. ఈ 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో 8 ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు భర్తీ చేసేందుకు కమిషన్‌కు ప్రతిపాదనలు అందాయి. మొత్తంగా 142 పోస్టులకు త్వరలోనే 5 వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి తెలంగాణ పరిధిలో మొత్తం 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నప్పటికీ.. జనాభా, పాఠశాలలు సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్ ఒక్క జిల్లాకే ఏకంగా 12 పోస్టులు రానున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్లు పెరిగాయి. దీంతో 28 పోస్టులను మంజూరు చేయాలని 4 రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం 33 జిల్లాలకు కలిపి కేవలం 12 డీఈఓ పోస్టులే ఉన్నాయి. అదనంగా మరో 21 పోస్టులను మంజూరు చేయాలనీ ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా త్వరలోనే 28 డిప్యూటీ ఈఓ, 21 డీఈఓ పోస్టుల భర్తీకి ప్రకటన రానుంది.

## మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించి లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి : అధికారులను ఆదేశించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ....





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధిపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హౌసింగ్ కార్పొరేషన్ మరియు మున్సిపల్ శాఖతోపాటు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .... మౌలిక వసతుల కల్పనలో భాగంగా నియోజకవర్గం లోని అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల వద్ద.... మంజీరా నీటి సౌకర్యం, సివరాజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, లిఫ్ట్ ల నిర్వహణతో పాటు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. కరెంట్ మీటర్లను జిహెచ్ఎంసి పేరు మీద కాకుండా లబ్ధిదారుల పేరుకు మార్చి బిల్లును ఇవ్వాలి.పారిశుద్ధ నిర్వాహణలో భాగంగా చెత్త సేకరణను చేపట్టి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచాలి. ఎమర్జెన్సీ సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా ఆరోగ్య కేంద్రంతో పాటు మహిళ, శిశు, గర్భిణీ స్త్రీలకు ఉపయోగపడే అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేయాలి. దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి.ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమీషనర్లు సాబేర్ అలీ, వెంకటేష్ నాయక్, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ రవీందర్, నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు బాలాజీ నాయక్, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, సునీల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనతో సర్వతోముఖాభివృద్ధి వైపుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి: బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద....





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)జగద్గిరిగుట్ట126 డివిజన్ అంజయ్య నగర్ –బి, సీ బస్తీలలో సుమారు 47.00 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని సర్వతోము ఖాభివృద్ధి వైపుగా అభివృద్ధి చేయడమే మా బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, శశి, బాబు గౌడ్, సయ్యద్ సాజిద్, ఇందిరా గౌడ్, త్రివేణి, నాని, పాపులు గౌడ్, మజ్జి శ్రీను, జయ కృష్ణ, మనోజ్, ముంతాజ్, గిరి, బండ మహేందర్, బ్రహ్మానంద చారి, హనుమంతు, సత్యనారాయణ, గణేష్, వెంకటేష్, మహమూద్, అంజయ్య నగర్ – బి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్, ఉపాధ్యక్షులు సోమేష్, ప్రధాన కార్యదర్శి కిరణ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుచ్చిబాబు, లక్ష్మారెడ్డి, వీరేశం, సంజీవరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జంగారెడ్డి, నందకుమార్, దుర్గాప్రసాద్, రాజు, జయశ్రీ, భూలక్ష్మి, బాలలక్ష్మి, రాధా, అమరావతి, అంజయ్య నగర్ –సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గురువయ్య, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, ఉపాధ్యక్షులు పాండు, కోశాధికారి అశోక్ గౌడ్, కాలనీ నాయకులు నాగరాజు ముదిరాజ్, బాబురావు, అరవింద్, రాము, రమేష్, యాదగిరి, భీమయ్య, రాజశేఖర్, లాలయ్య, సుధాకర్, వెంకటయ్య, లక్ష్మి, లలిత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

### బిఆర్ఎస్ విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రోబోటిక్,ఏఐ ల్యాబ్ ప్రారంభం

### రోబోటిక్ తో విద్యావిధానం సులభతరం










కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని ఎదగాలని విద్యావిధానంలో వస్తున్న మార్పులక నుగుణంగా రోబోటిక్ విద్య ఎంతో అవసరమని బిఆర్ఎస్ విప్,కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ విద్యార్థులకు సూచించారు.ఈ మేరకు శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భగత్ సింగ్ మార్గ్ లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ.ఐ.)తరగతి గదులను మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి,స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ శివరాత్రి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ల్యాబ్ ను వారు లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో రోజురోజుకు పెరుగుతున్న మార్పులకు అనుగుణంగా సాధారణ విద్యతోపాటు,సాంకేతిక విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు.ముందుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చైతన్య పాఠశాలలో రోబోటిక్,ఏఐ ల్యాబ్ ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల యాజమాన్యానికి అయన అభినందనలు తెలిపారు.రోబోటిక్ ద్వారా సులభతరంగా పాఠ్యాంశాలు విద్యార్థులు అర్థం చేసుకోవచ్చున్నారు.మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ. విజయకుమారి మాట్లాడుతూ రోబోటిక్ విద్య ద్వారా విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నారు.అదునాతన రీతిలో పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థుల బంగారుభవితకు పునాదులు వేస్తున్న చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరిని డిఇఓ ప్రత్యేకంగా అభినందించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తమ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా నాణ్యమైన సాంకేతిక విద్య నేర్పాలనే లక్ష్యంతో పాఠశాలలో రోబోటిక్,ఏఐ.ల్యాబ్ ప్రారంభించడం జరిగిందన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉంటున్న ఈ ప్రాంతంలో అతి తక్కువ ఫీజులతో మెరుగైన విద్యను నేర్పుతూ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జె.నాగరాజు, కోశాధికారి పరుశురాం గౌడ్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు కే. శ్రీనివాస్ చారి,నర్సిరెడ్డి,కోశాధికారి శ్రీకాంత్,బాలానగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు సుశీల్ కుమార్,కాశిరెడ్డి,కూకట్పల్లి కోశాధికారి సుబ్రహ్మణ్యం, బోరబండ అధ్యక్షులు షోయబ్,ఘట్కేసర్ అధ్యక్షులు అంజన్ రెడ్డి,ఉప్పల్ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ధన్ సాగర్ తో పాటు వివిధ పాటల కరస్పాండెంట్ లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా ఎన్ రామచంద్రరావు పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా భారీ ర్యాలీ... పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి






కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా) తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా ఎన్.రామచంద్ర రావు పార్టీ పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా శనివారం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం నందు అమ్మవారిని దర్శించుకొని తదనంతరం అమరవీరుల స్థూపం దగ్గర అమరవీలకు నివాళులు అర్పించి నాంపల్లి బిజెపి పార్టీ ఆఫీస్ వరకు ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు కార్పొరేటర్ గౌరవ రావుల శేషగిరి ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ ,శంకర్, మంజునాథ్ ,శ్రీనివాస్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్షను ప్రతిఘటిద్దాం

### సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

### -దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షు మామిడి సోమయ్య





వరంగల్ (సూర్య ప్రభా) జర్నలిస్టుల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని,ఈ వైఖరిని జర్నలిస్టులు ప్రతిఘటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుస్తున్నా..జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం వరంగల్ లోని కెమిస్ట్రీ భవన్ లో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా తృతీయ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జన చైతన్య యాత్ర చేస్తామని, ప్రజల మద్దతు కోరతామని ప్రకటించారు. సమస్యలపై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టుల జీవన స్థితిగతులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా మండలస్థాయి విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టులకు అన్యాయం చేశాయని ఆయన విమర్శించారు. జర్నలిస్టులందరికీ ఉపయోగపడాల్సిన మీడియా అకాడమీని ఆ యూనియన్ లు తమ జేబు సంస్థగా మార్చుకున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఏం ఒరిగిందని, ఏం మేలు చేశారని పాలకులు, జర్నలిస్టు సంఘాలు సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకున్నట్టు జర్నలిస్టుల పేరు చెప్పి అధికార పదవులు పొంది పాలకులకు ఊడిగం చేస్తూ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి జర్నలిస్టు సంఘాల పట్ల యావత్ జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, రాష్ట్రంలో చాలా ఏళ్ళుగా నడుస్తున్న అనేక చిన్న పత్రికలను ప్రభుత్వం గుర్తించకుండా అణచివేస్తున్నదని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న అన్ని చిన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలన్న నిబంధనను పాలకులు తుంగలో తొక్కి దొడ్డిదారిన పైరవీలకు ప్రాధాన్యమిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని గుర్తించి జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మూడు మాసాల్లో అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్,రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫెడరేషన్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం జర్నలిస్టుల సమస్యలపై నిరంతం పోరాడుతూ, జర్నలిస్టులకు అండగా ఉంటుందని వారన్నారు.

విలేకరులు పాలకుల ముందు తలవంచకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని అన్నారు. జర్నలిస్టులు పాలకులకు ఊడిగం చేయాల్సిన అవసరం లేదని, ప్రజల పక్షాన నిలిచి ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జర్నలిస్టులకు అండగా ఉంటుందని, సభ్యులందరు సమిష్టిగా ఉండాలని అన్నారు. సీనియర్ జర్నలిస్టు, ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో స్థానిక కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్, ఫెడరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి బొట్ల స్వామిదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొలుమారి గోపాల్, చుంచు అయిలయ్య, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల నరేష్ బాబు, సీనియర్ జర్నలిస్టు సానిక్ తదితరులతో పాటు వివిధ పత్రికలు,చానళ్ళకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ నూతన కార్యవర్గం ఎన్నిక..**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా తృతీయ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్ (మెట్రో ఈవినింగ్), జిల్లా కార్యదర్శిగా బొట్ల స్వామిదాసు (నవభారత్), కోశాధికారిగా భానోత్ సురేష్ (మెట్రో), ఉపాధ్యక్షులుగా వెల్దె రాజేందర్ (ప్రజాదర్బార్), కుర్మిల్ల దుర్గారావు (మనం), సహాయ కార్యదర్శులుగా బావుండ్లపల్లి కిరణ్ (నవతెలంగాణ), ఆకోజు సాంబయ్య (ఆర్టిఐ నీఘా), బాదం సురేష్ (వాయిస్ ఆఫ్ వార్డ్), జిల్లా కార్యవర్గ సభ్యులుగా స్వామిదాసు (మెట్రో), సైదులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలడుగు సురేందర్ (అక్షిత), అడువ నర్సింగరావు (సూర్య), జాతీయ కౌన్సిల్ సభ్యులుగా బుడిగి మల్లేశం (మనం) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు



## 6 వందల రోజులు.. హామీలు అమలుకాలేదు

హైదరాబాద్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతామని చెప్పి.. 600 రోజులైనా (దాదాపు 20 నెలలు) అమలు చేయలేదని విమర్శించారు. 6 గ్యారంటీల్లో భాగంగా 63 అనుబంధ హామీలను ప్రకటిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో ఊరూరా కరపత్రాలు పంచారని ఎద్దేవా చేశారు. అన్ని వార్తా పత్రికల్లో మొదటి పేజీల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. తమను మోసం చేశారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని రామచందర్‌రావు లేఖలో పేర్కొన్నారు.



## రూ.15 వేల కోట్ల వారసత్వ ఆస్తి.. సైఫ్‌కు చుక్కెదురు

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆయన కుటుంబానికి చెందిన రూ. 15,000 కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటుంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తాత)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు.



## సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్త

హైదరాబాద్: చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మరో 40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30-40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు.

ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

## వాణిజ్య కేంద్రాల్లో రోజుకు 10 గంటల పనికి అనుమతి

హైదరాబాద్: వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



## ఆసుపత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో ఈరోజు ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని కేసీఆర్‌కు వైద్యులు సూచించారు. తర్వాత మళ్లీ పరీక్షలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వైద్య పరీక్షల కోసం గురు, శుక్రవారాల్లో మరోసారి కేసీఆర్ యశోద ఆసుపత్రికి వెళ్లనున్నారు.

## ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వడమే లక్ష్యం: భట్టి విక్రమార్క

హైదరాబాద్: అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ. 1.49 కోట్లు ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. "ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలి" అని భట్టి విక్రమార్క తెలిపారు.



**మహిళలకు 5 వేల ఈవీ ఆటోలు ఇచ్చే యోచన: మంత్రి పొన్నం...**

మహిళలకు 5 వేల ఈవీ ఆటోలు ఇచ్చే యోచన ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీంతో హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను మహిళా సంఘాలు ప్రచారం చేయాలని చెప్పారు.



## వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

కరీంనగర్: కరీంనగర్‌లో జగన్నాథుడి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. రథయాత్రలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో నగరవాసులు రథయాత్రలో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్టుంది: మంత్రి సీతక్క



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అర్థం కానట్టుందని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరింది కేటీఆర్‌కు కాదని.. కేసీఆర్‌కు అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్న కేసీఆర్ చర్చకు రావాలన్నారు. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే చచ్చిపోయిందని.. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లెలే అంగీకరించడం లేదన్నారు. కేటీఆర్ తమ నాయకుడే కాదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారని సీతక్క పేర్కొన్నారు.



## 876 అడుగులకు శ్రీశైలం నీటిమట్టం

శ్రీశైలం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1,20,419 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 67,009 క్యూసెక్కులుగా ఉంది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,704 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 876.90 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 172.66 టీఎంసీలకు చేరింది.

# హైదరాబాద్ స్పా మసాజ్ సెంటర్లపై కొరఢా

హైదరాబాద్ నగరంలోని స్పా మసాజ్ సెంటర్లపై సైబరాబాద్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఇటీవల స్పాల పేరుతో పెరిగిపోతున్న అనైతిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను విధించారు. ప్రజల భద్రత, ముఖ్యంగా మహిళల రక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం.., ఇకపై స్పా సెంటర్లు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే పనిచేయాలి. ఈ సమయాలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో పోలీసులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నివాస ప్రాంతాల్లో (రెసిడెన్షియల్ ఏరియాలు) స్పా సెంటర్లను నిర్వహించరాదు. వ్యాపార ప్రాంతాల్లో మాత్రమే వీటిని నడపాల్సి ఉ ంటుందని పేర్కొన్నారు. స్పాల్లో పనిచేసే ఉద్యోగులకు అర్హతలు తప్పనిసరి అని పోలీసులు నొక్కి చెప్పారు. ఫిజియోథెరపిస్టులు, అకుప్రెషర్ నిపుణులు వంటి అర్హతలతో ఉన్నవారే స్పాల్లో పనిచేయాలని



సూచించారు. స్పాల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు దారితీయకూడదని హెచ్చరించారు.

**– పత్రాలు, సమాచార ప్రదర్శన తప్పనిసరి:** పారదర్శకతను పెంచేందుకు ప్రతి స్పాలో వారి లైసెన్స్ నంబర్, ఫీజు రకాలు, కేంద్రం పేరు వంటి వివరాలను స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి. అంతేకాకుండా, ప్రతి కస్టమర్ వివరాలు, ఉద్యోగుల పూర్తి వివరాలతో కూడిన రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

**– సీసీటీవీ కెమెరాలు తప్పనిసరి:** అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, మహిళలు, పిల్లల భద్రతను కాపాడేందుకు స్పాల ప్రధాన ద్వారం, రెసెప్షన్, ఇతర సాధారణ ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

**–మానవ అక్రమ రవాణాపై కఠిన చర్యలు:** ఈ కొత్త మార్గదర్శకాలు ప్రధానంగా మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) నివారణకు.. మహిళల రక్షణకు తీసుకొచ్చినవని పోలీసులు తెలిపారు. స్పాల పేరుతో జరిగే అసాంఘిక చర్యలపై ఎప్పటికప్పుడు నిఘా ఉ ంచుతామని స్పష్టం చేశారు. ఇటీవల పోర్న్ వీక్షణను నేరంగా ప్రకటించిన ప్రభుత్వం, ప్రజల మధ్య వాయిరూఢమైన దృష్టికోణాలను తగ్గించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. లైంగిక వేధింపుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, పోలీసులు ఈ చర్యలతో శృంగార ప్రేరణతో వ్యవహరిస్తున్న స్పాలపై కఠినంగా వ్యవహరించబోతున్నారని స్పష్టంగా తెలియజేశారు. మొత్తం మీద "స్పా" పేరుతో జరిగే చీకటి చట్టాలకు చెక్ పెట్టేందుకు ఈ 9 %ూవీ – 9 ్రావీ% నియమాలు పోలీసు విభాగం నుంచి సానుకూల స్పందనను పొందుతున్నాయి. ఈ చర్యలు హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు దోహదపడతాయని ఆశిస్తున్నారు.

# 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'కు ఆమోదం.. ట్రంప్ కలల బిల్లు ఆమోదంలోకి..



ట్రంప్ 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' ఇప్పుడు చట్టంగా అమల్లోకి వచ్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుపై సంతకం చేయడంతో ఇది అమెరికా రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. పన్నుల కోతలు, ప్రభుత్వ వ్యయ నియంత్రణ, సరిహద్దు భద్రతలో పెట్టుబడులు వంటి కీలక అంశాలతో రూపొందించిన ఈ బిల్లును రిపబ్లికన్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించింది.

**– సెనెట్, ప్రతినిధుల సభలో ఉత్కంఠభరిత ఆమోదం...** ఈ బిల్లు అమెరికా సెనెట్‌లో సుదీర్ఘ చర్చలకు దారితీసింది. ముగ్గురు రిపబ్లికన్లు వ్యతిరేకించినప్పటికీ 51–50 ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ టై బ్రేకర్‌గా కీలక ఓటు వేయడం గమనార్హం. ఆ తర్వాత ప్రతినిధుల సభలో కూడా 218–214 ఓట్ల తేడాతో బిల్లు ఆమోదం పొందింది. ఇక్కడ కూడా ఇద్దరు రిపబ్లికన్ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారు.

**–చట్టంపై ట్రంప్ స్పందన...** బిల్లుపై సంతకం చేసిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ "ప్రజలు ఇంత సంతోషంగా ఉండటం నేను ఎప్పుడూ చూడలేదు. ఇది అమెరికాకు ఒక అద్భుతమైన రోజు. ఈ చట్టం ద్వారా ప్రతి ఒక్కరికీ లాభం కలుగుతుంది. మిలిటరీ నుంచి మొదలుకొని కార్మికుల వరకూ అందరికీ ఇది మేలు చేస్తుంది" అన్నారు. ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్, సెనెట్ మెజారిటీ లీడర్ జాన్ థునెలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "ఈ చట్టంతో పన్నుల్లో అతిపెద్ద కోత, వ్యయాల నియంత్రణ, సరిహద్దు భద్రతలో భారీ పెట్టుబడి ప్రభుత్వ వ్యయనియంత్రణలో కీలకంగా నిలుస్తాయి" అని స్పష్టం చేశారు.

**– వైట్‌హౌస్‌లో వేడుకలు...** ఈ చట్టంపై సంతకం చేయడం ఒక రాజకీయ వేడుకలా మారింది. వైట్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రంప్ మద్దతుదారులు, మిత్రపక్ష నేతలు, మిలిటరీ కుటుంబాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టెల్త్ బాంబర్లు, ఫైటర్ జెట్లు గగనతలంలో విన్యాసాలు చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించాయి.

**–బిల్లులోని ప్రధాన అంశాలు :** పన్నుల్లో భారీ కోతలు, ప్రభుత్వ వ్యయాలపై నియంత్రణ, సరిహద్దు భద్రత కోసం నిధుల కేటాయింపు. వలస చట్టాల అమలుకు కఠిన విధానాలు, కొన్ని తాత్కాలిక పన్ను మినహాయింపులను శాశ్వతం చేయడం

ఒకవైపు ఈ బిల్లును రిపబ్లికన్ శిబిరం అమెరికా ఆర్థిక వ్యవస్థకు పునాది రాయిగా అభివర్ణిస్తుండగా, మరోవైపు విమర్శలు కూడా ఎదురవుతున్నాయి. ఈ బిల్లుతో లక్షలాది మంది అమెరికన్లు ఆరోగ్య బీమా కోల్పోతారని హెచ్చరికలు వస్తున్నాయి. పన్నుల కోతల వల్ల కొన్ని ప్రభుత్వ సేవలు తగ్గే అవకాశం కూడా ఉ ందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాన్యులపై దీని ప్రభావం పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ, ఈ చట్టం ట్రంప్ పాలనలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# జనాభా సంక్షోభం : మూడో బిడ్డను కంటే రూ.12 లక్షలు

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా పేరొందిన చైనా.. ప్రస్తుతం ఊహించని జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జనాభా విస్ఫోటకాన్ని నియంత్రించేందుకు దశాబ్దాల క్రితం అమలు చేసిన "వన్ చైల్డ్ పాలసీ" ఇప్పుడు చైనాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ విధానం వల్ల వృద్ధుల సంఖ్య పెరిగిపోవడం, యువత తగ్గిపోవడం, పనిచేసే వయసున్న ప్రజల సంఖ్య గణనీయంగా పడిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు పెను ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చైనాలో ప్రస్తుత పరిస్థితి ఏమిటి?..** చైనాలో గత కొన్నేళ్లుగా పెళ్లి చేసుకునే యువత సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉద్యోగాల కొరత, పెళ్లి వ్యవస్థ పట్ల నిరాసక్తత, ఆధునిక జీవనశైలిలో వచ్చిన మార్పులు వంటివి యువతను వివాహానికి దూరం చేస్తున్నాయి. దీని ఫలితంగా జననాల రేటు ఆందోళనకరంగా పడిపోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు, 2024 జనవరి 1 తర్వాత పుట్టే శిశువుల సంఖ్యను పెంచేందుకు చైనా ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది.

**– పిల్లల్ని కనే వారికి భారీ డబ్బు!...** జనాభా వృద్ధిని ప్రోత్సహించేందుకు చైనా సరికొత్త పథకాలను ప్రవేశపెట్టింది. ప్రతి



పుట్టిన శిశువుకు మూడేళ్ల పాటు సంవత్సరానికి 3,600 యువాన్లు (దాదాపు ?43,000) అందించనున్నట్లు ప్రకటించింది. మంగోలియా ప్రాంతంలో అయితే రెండవ బిడ్డకు ?6 లక్షల వరకు .. మూడవ బిడ్డకు ఏకంగా ?12 లక్షల వరకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని ప్రాంతీయ ప్రభుత్వాలు గృహనిర్మాణ సబ్సిడీలను కూడా అందజేస్తున్నాయి.

**– ఈ స్థితికి కారణం ఏమిటి?...** గత దశాబ్దాలుగా చైనాలో అమలు చేసిన కఠినమైన కుటుంబ నియంత్రణ విధానాలు, యువతలో పెరుగుతున్న అనిశ్చితి, అధిక నిరుద్యోగం, ఆర్థిక భయాలు.. ఇవన్నీ కలిసి జాతీయ స్థాయిలో జననాల రేటును గణనీయంగా తగ్గించాయి. నిపుణుల అంచనాల ప్రకారం, ఇదే పరిస్థితి కొనసాగితే 2100 నాటికి చైనా జనాభా 80 కోట్లకు తగ్గే అవకాశం ఉంది. ఇది ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టాన్ని కలిగించవచ్చు.

**– వృద్ధుల పెరుగుదల.. యువత తగ్గుదల ప్రభావం...** జననాల తగ్గుదలతో పాటు వృద్ధుల సంఖ్య అధికమవుతోంది. అదే సమయంలో పనిచేసే వయసు గల జనాభా తగ్గిపోతోంది. ఇది దేశంలోని వ్యవసాయ ఉత్పత్తి, తయారీ పరిశ్రమలు, సేవా రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. శ్రామిక శక్తి కొరత వల్ల ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉంది.

**–కొత్త పథకాలు ఉపయోగపడతాయా?..** ప్రభుత్వం ఆశలు పెట్టుకున్న ఈ నగదు ప్రోత్సాహకాలు, గృహ సబ్సిడీలు యువతను పెళ్లి చేసుకొని పిల్లలు కనడానికి ఎంతవరకు ప్రోత్సహిస్తాయో కాలమే నిర్ణయించాలి. ఎందుకంటే, ఒక బిడ్డను పెంచడానికి అయ్యే ఖర్చులు, జీవన నాణ్యతపై యువత ఆలోచనలు ఇవన్నీ కూడా ఈ విధానాలపై ప్రభావం చూపవచ్చు. కేవలం నగదు ప్రోత్సాహకాలతో పాటు, ఉద్యోగ భద్రత, మెరుగైన సామాజిక సేవలు, కుటుంబ వ్యవస్థ పట్ల నమ్మకం పెరిగినప్పుడే జనాభా వృద్ధికి సమగ్ర మార్గం ఏర్పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సినిమా 'షో'

# తమన్నా లక్... రెండు దశాబ్దాలైనా రచ్చే

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. 2005 సంవత్సరంలో హిందీ మూవీ చాంద్ సా రోషన్ చెహ్రా, తెలుగు సినిమా 'శ్రీ' తో సినీ కెరీర్‌ను ప్రారంభించింది. మొదటి ఏడాదిలో లక్ కలిసి రాలేదు. సినిమాలు పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేదు. ఆ తర్వాత ఏడాది కూడా కలిసి రాలేదు. 2007లో నటించిన హ్యాపీ డేస్ సినిమా తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నాకు వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు. తెలుగులో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ స్టార్ హీరోల అందరితోనూ సినిమాలు చేసిన ఘనత ఈ అమ్మడికి దక్కింది. యంగ్ స్టార్ హీరోలతోనే కాకుండా చిరంజీవి, వెంకటేష్ వంటి సీనియర్ స్టార్స్‌తోనూ ఈ అమ్మడు నటించింది. సాధారణంగా హీరోయిన్స్ దశాబ్ద కాలం పాటు బిజీగా కొనసాగితే గొప్ప విషయం. కానీ ఈ అమ్మడు రెండు దశాబ్దాలు అయినా కెరీర్ ఏ మాత్రం జోరు తగ్గలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడి జోరు తగ్గింది. కానీ నార్త్ ఇండియాలో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. సినిమాలనే కాకుండా వెబ్ సిరీస్‌లు, మ్యూజిక్ వీడియోలు, ఐటెం సాంగ్స్ ఇలా చాలా విధాలుగా ప్రేక్షకులకు చేరువ అవుతూ వస్తోంది. మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌లో ఏకంగా అయిదు సినిమాలు చేస్తోంది. అందులో రెండు పెద్ద



సినిమాలు కావడం విశేషం. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటిస్తున్న వ్యన్ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్న విషయం తెల్సిందే. దీపక్ మిశ్రా దర్శకత్వంలో భారీ అంచనాల నడుమ రూపొందుతున్న 'వ్యన్' సినిమాపై తమన్నా చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఈ అమ్మడి సినిమాలు బాలీవుడ్‌లో చాలా విడుదల అయ్యాయి. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు దక్కించుకోలేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సక్సెస్‌ను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ అమ్మడు రైడ్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో మిల్కీ బ్యూటీ తమన్నా పాత్ర గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి రెండు దశాబ్దా లు అయినా కూడా కెరీర్‌లో ఏమాత్రం తగ్గకుండా ఓ రేంజ్‌లో దూసుకు పోతున్న మిల్కీ బ్యూటీ ఎంతో మందికి ఆదర్శం. ఒక్క భాషపై నమ్మకం పెట్టుకోకుండా, ఒకే ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ ఉండకుండా అన్ని భాషల్లో సినిమాలు చేయడం ద్వారా ఒకచోట కాకున్నా మరో చోట అయినా ఆఫర్లు ఎప్పుడూ ఉంటాయి అనేది తమన్నాను చూస్తే అర్థం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల వారు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ తమన్నాకు ఉన్న క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ క్రేజ్‌కు తగ్గట్లుగానే మిల్కీ బ్యూటీ తమన్నా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ అందమైన ఫోటోల కారణంగా కూడా తమన్నాకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వస్తూ ఉంటాయి. మరో దశాబ్ద కాలం పాటు మిల్కీ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉంది. అదృష్టం అంటే తమన్నాదే అంటూ ఆమె ఫ్యాన్స్ కామెంట్ చేస్తూ ఉంటారు.

# నా ఎత్తుతో సమస్య... చాలా బాధ వేసేది : మీనాక్షి చౌదరి





గత ఏడాది 'లక్కీ భాస్కర్', ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో నటించి సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. తెలుగులో మొదటి సినిమా 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' నిరాశపరచడంతో ముందు ముందు ఆఫర్లు వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ లక్కీగా ఈ అమ్మడికి ఆ సినిమా కారణంగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. గత ఏడాదిలో చాలా సినిమాలు చేసిన ఈ అమ్మడు లక్కీ భాస్కర్‌తో మాత్రమే హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభం గురించి, తన బాల్యం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... చిన్నతనంలో ఇతరులతో మాట్లాడేందుకు చాలా ఇబ్బంది పడేదాన్ని. కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. దాంతో చాలా మంది అమ్మాయిలతో పోల్చితే నేను చాలా ఎత్తుగా ఉండేదాన్ని. దాంతో అంతా నాకు దూరంగా ఉ ండేవారు, నా ఎత్తు నాకు పెద్ద సమస్యగా అనిపించింది. ఆ సమయంలో చాలా బాధ వేసింది. ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరిష్కరించుకోవాలని సూచించాడు. దాంతో నేను బుక్స్‌ను స్నేహితులుగా చూడటం చేశాను. ఎక్కువ బుక్స్ చదవడంతో పాటు, అందాల పోటీల్లో పాల్గొనేందుకు, ఆటలపై ఆసక్తి కలిగింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో నిరాశే మిగిలింది. అయితే వచ్చిన ప్రతి ఆఫర్ కూడా నేను సాధ్యం అయినంత వరకు కష్టపడి సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా కారణంగానే నాకు ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. కనుక ఇండస్ట్రీలో ప్రతి చిన్న ఆఫర్ కూడా కచ్చితంగా ముందు ముందు కెరీర్ నిలదొక్కుకునేందుకు సహాయపడుతుందని భావిస్తున్నాను. సీనియర్ హీరోలతో నటించడం ఏంటి అంటూ చాలా మంది నన్ను ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి హీరోతో అయినా నటించేందుకు నాకు ఇబ్బంది లేదు. సీనియర్ హీరోలతో నటించడం అనేది ఒక జోనర్ సినిమాగా భావిస్తాను.

వెంకటేష్ గారితో సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించడం అనేది చాలా కంఫర్ట్‌బుల్‌గా అనిపించింది. ఆయనతో వర్క్ చేయడంను ఎంజాయ్ చేశాను. ఇప్పుడు చిరంజీవి గారి సినిమా విశ్వంభరలోనూ నటిస్తున్నాను. ఆ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా, గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి. కథల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి తప్ప అతి విశ్వాసం, అతి నమ్మకంతో సినిమాలను వదులుకోవద్దని మీనాక్షి సూచించింది. పుకార్లు అనేవి చాలా కామన్‌గా వస్తూ ఉ ంటాయి. అయినా కూడా రూమర్స్ చూసినప్పుడు కోపం వస్తుంది. నేను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాను. కనుక నన్ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి క్లారిటీ తీసుకోవాలని మీనాక్షి కోరింది. నా గురించి ఏ విషయం అయినా సోషల్ మీడియా ద్వారా నేను చెప్తాను. కనుక పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

# బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా



ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాక్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉండవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది. తన తల్లిదండ్రులు కమల్, సారికలు విడాకులు తీసుకున్న సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురి అయ్యాను. చెన్నై నుంచి ముంబై మకాం మార్చిన సమయంలో బెంజ్ కారులో తిరిగే నేను ముంబై లోకల్ రైల్‌లో, ట్యాకీ కారులో తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో జీవితం చాలా నేర్పించింది. అన్ని విషయాలను గుర్తు పెట్టుకుని జీవితంలో ముందుకు సాగుతూ వచ్చాను. తిరిగి నా తండ్రి వద్దకు చేరుకునే వరకు చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. అంత ఈజీగా నా జీవితం సాగలేదని, ముందు ముందు కూడా నటిగా తనను తాను నిరూపించుకునేందుకు విభిన్నమైన పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ బోల్డ్‌గా వ్యాఖ్యలు చేసింది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417